స్త్రీ, శిశు సంక్షేమశాఖలో..
ఫర్నిచర్ పరేషాన్

- 20 కోట్ల వ్యవహారంపై దుమారం
- సర్దుకున్న సెట్విన్... ప్రక్రియ రద్దు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 15,640 అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చే నేపథ్యంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, సెట్విన్ మధ్య ఒప్పందంపై ఆరోపణల నేపథ్యంలో మొత్తం ప్రక్రియనే రద్దు చేస్తున్నట్టు సంబంధింత విభాగం ప్రకటించింది. రూ. 20 కోట్ల విలువైన ఫర్నిచర్‌ను సమకూర్చాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ సెట్విన్‌ను కోరింది. తమకు కావాల్సిన వారు మాత్రమే ఫర్నిచర్‌ను సరఫరా చేసేందుకు అనువుగా సెట్విన్ వ్యవహరించింది. పత్రికా ప్రకటనకు ఆస్కారం లేకుండా కార్యాలయ నోటీస్‌బోర్డుపై టెండర్ నోటీసును అతికించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలంగాణ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ స్టీల్ అండ్ ఉడన్ ఫర్నిచర్స్ తయారీదారుల అసోసియేషన్ తప్పుబట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలకు బుక్ ర్యాక్స్, రౌండ్‌టేబుల్స్, గ్రీన్‌చాక్‌బోర్డ్స్ తదితర వస్తువులు సరఫరా చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను గత నెల 24న కోరింది. ఆ మరునాడే కా ర్యాలయం బోర్డుపై టెండర్ నోటీసును సెట్విన్ విభాగం అంటించింది. మే 25వ తేదీ నుంచి 31వ తేదీ సాయంత్రం 4 గం టల లోపు నిర్దేశిత ఫార్మాట్‌లో టెండర్లు స మర్పించాలని పేర్కొన్నది. దీనిపై తెలంగా ణ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ తీ వ్ర అభ్యంతరం పెట్టింది. పరిస్థితి తీవ్రతను గ్రహించిన సెట్విన్ ఈ టెండర్ ప్రక్రియను రద్దు చేస్తున్నట్టు ఈనెల 3వ తేదీన అదే నోటీస్‌బోర్డు ద్వారా వెల్లడించింది.

మొబైల్ యాప్‌తో గర్భిణుల్లో డిప్రెషన్ గుర్తింపు

న్యూఢిల్లీ, జూన్ 10: గర్భిణులు తమ ప్రెగ్నెన్సీ చివరి దశల్లో కుంగుబాటుకు గురయ్యే అవకాశం ఉన్నదో లేదో మొబైల్ యాప్ ద్వా రా అంచనా వేయొచ్చని పరిశోధకులు తెలి పారు. నిద్ర మంచిగా పడుతుందా? నాణ్య మైన ఆహారం తీసుకుంటున్నారా? అభద్రతా భావం ఏమైనా ఉన్నదా? వంటి చిన్న ప్రశ్న లను గర్భిణులను అడిగి ప్రమాద కారకాలను పరిశోధకులు గుర్తించారు. తాము గర్భిణు లను చిన్న ప్రశ్నలు అడిగి వారు డిప్రెషన్‌లో ఉన్నారో లేదో తెలుసుకున్నామని, అవగా హన కల్పించామని అమెరికాలోని పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో జనరల్ ఇంటర్నల్ మెడి సిన్ అసోసియేట్ ప్రొఫెసర్ తమర్ కృష్ణ మూర్తి తెలిపారు.

హామీలకుపైసలెట్లా?

మొదటిపేజీ తరువాయి...

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధానంగా వ్యవసాయ శాఖపై తీవ్ర ఒత్తిడి నెలకొన్నది. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా కింద పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ హామీ అమలు కాకపోవడంతో రైతుల నుంచి వ్యతిరేకత మొదలైంది. వానకాలం సీజన్ ఆరంభం కావడంతో రైతుభరోసా ఇవ్వాల్సి ఉన్నది. ఎరువులు, ఇతర అవసరాలకు గత సంవత్సరంతో పోల్చితే దాదాపు 10% అధికంగా నిధులు అవసర మని అంచనా వేస్తున్నారు. రైతుబంధు కింద ఇప్ప టివరకు ఏటా రూ.15 వేల కోట్లు కేటాయించేవారు. రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వా లంటే ఈ మొత్తాన్ని రూ.23 వేల కోట్లకు పెంచాల్సి ఉంటుందని అంచనా. దీనికితోడు రైతు కూలీలకు ఏటా రూ.12 వేల కోట్ల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ఉపాధిహామీ కార్డుల ఆధా రంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్తున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 34.41 లక్షల యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 58.8 లక్షల మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు. జాబ్‌కార్డులను పరిగణనలోకి తీసుకొని లెక్కించినా, ఏటా రూ.12 వేల చొప్పున బదిలీ చేస్తే రూ.4 వేల కోట్లకుపైగా నిధులు అవసరం.

వ్యవసాయానికి భారీగా నిధులు

2023-24 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, సహకార రంగాలకు కలిపి రూ.26,831 కోట్ల బడ్జెట్ కేటాయించారు. సాధారణ పెంపుతోపాటు అదనంగా కేటాయించాల్సిన రూ.15 వేల కోట్లు కలిపితే.. ఈ ఏడాది రూ.43 వేల కోట్ల వరకు కేటాయించాల్సి వస్తుందని అంచనా. అంటే దాదాపు 60% నిధులు అదనంగా కేటాయించాల్సి వస్తుందని భావిస్తున్నారు.

- సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సుమారు కోటి టన్నుల వరకు సన్న ధాన్యం వస్తుందని అంచనా. వీటికి రూ.500 కోట్లు అదనంగా ఖర్చు కానున్నది.
- ఆగస్టు 15లోగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒట్టు మీద ఒట్టు పెట్టారు. రుణమాఫీకి దాదాపు రూ.40 వేల కోట్లు అవసరమని అంచనా. ఈ నిధులను ఎలా సమకూర్చుతారనేది ప్రశ్నార్థకంగా మారింది. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం చెప్తున్నా.. అది సాధ్యం కావడం లేదని అంటున్నారు. దీంతో నిధులను ఏ పద్దు కింద, ఎలా సమకూర్చాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

విద్యాశాఖదీ ఇదే పరిస్థితి

విద్యారంగానికి సంబంధించి మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. దీనికి రూ.650 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. దీంతోపాటు విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు ఇస్తామని చెప్పారు. ఇందుకు అర్హులైన విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది ఉంటారని అంచనా. వీరందరికీ ఇవ్వాలంటే ఏకంగా రూ.80 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పున్నారు. మండలానికి ఒక అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటు హామీని నెరవేర్చాలంటే రూ.3 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా.

కత్తిమీద సాములా కేటాయింపులు !

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు ఈసారి కేటాయింపులు కత్తిమీద సాములా మారాయని అధికారులు వాపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించింది. తాము దళితబంధును అంబేద్కర్ అభయహస్తంగా మారుస్తామని, రూ.12 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గత బజ్జెట్‌లో దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించారు. ఈ మేరకు యూనిట్లు మంజూరు చేశారు. వీటికి నిధులు విడుదల చేయడంతోపాటు కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు, నిధుల కేటాయింపుతో రూ.40 వేల కోట్ల వరకు కేటాయించాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. బీసీలకు ఇచ్చిన హామీల అమలుకు దాదాపు రూ.20 వేల కోట్లు, ఎస్టీలకు ఇచ్చిన హామీల అమలుకు రూ.28 వేల కోట్ల వరకు కేటాయించాల్సి వస్తుందని అంటున్నారు. మైనార్టీ సంక్షేమంలో ఇమాంలు, మౌజంలు, పాస్టర్ల గౌరవ వేతనాలు పెంచుతామన్న హామీని నెరవేర్చాలంటే, రూ.550 కోట్ల వరకు కేటాయించాల్సి వస్తుందని చెప్తున్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు 5 వేల కోట్లు అవసరం అవుతుందని, ఉపాధి హామీ కూలీల వేతనాలు, పనిరోజుల పెంపునకు 2 వేల కోట్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయానికి 720 కోట్ల వరకు కావాల్సి ఉంటుందని వీటిని ఏ కోటా కింద పెడతారో తెలియని పరిస్థితి ఉన్నదని చెప్తున్నారు.

మహిళా సంక్షేమానికి భారీగా..

మహిళా సంక్షేమ శాఖకు భారీ కేటాయింపులు అవసరమని అధికారులు చెప్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో సుమారు 46 లక్షల మంది మహిళలు ఉంటారని అంచనా. వీరికి ఏటా రూ.13,500 కోట్ల వరకు ఖర్చవుతుందని లెక్కలు కడుతున్నారు. మహిళలకు స్కూటీ పథకానికి రూ.20 వేల కోట్ల వరకు కావాలని చెప్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి రూ.2 వేల కోట్ల వరకు అవసరమని అంచనా వేస్తున్నారు.

ఉద్యోగులకు కొత్త పీఆర్సీ

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీత భత్యాలు, పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపుల కోసం ఏటా సుమారు రూ.45 వేల కోట్ల వరకు ఖర్చు అవుతున్నట్టు అంచనా. త్వరలో కొత్త పీఆర్సీ అమలు చేయాల్సి ఉంటుంది. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పొందుపరిచారు. కేసీఆర్ ప్రభుత్వం చివరగా ఉద్యోగులకు 43% ఫిట్‌మెంట్ ఇచ్చింది. కేసీఆర్ ప్రభుత్వ ఆనవాళ్లను తుడిచేస్తామని రేవంత్‌రెడ్డి పంతం పట్టిన నేపథ్యంలో అంతకు మించి పీఆర్సీ ఇవ్వాల్సి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. 44-45% ఫిట్‌మెంట్ ఇచ్చినా, ఈ పద్దు ఏకంగా రూ.60 వేల కోట్లకు చేరుతుందని చెప్తున్నారు.

సెలూన్లు, ధోబీఘాట్లకు కరెంట్ బిల్లులు!

- లబోదిబోమంటున్న వృత్తిదారులు
- అలాంటిదేం లేదంటున్న అధికారులు
- మౌఖిక ఆదేశాలతో సిబ్బంది వసూలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : కుల వృత్తిదారులకు 250 యూనిట్ల దాకా ఉచిత కరెంటు ఇచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం చేదోడుగా ఉంటే.. కాంగ్రెస్ సర్కారు వచ్చీరాగానే దానికి మంగళం పాడి వారిపై ఆర్థిక భారం మోపింది. ఈ పథకాన్ని నిలిపివేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించకుండా క్షేత్రస్థాయిలో బిల్లులు వసూలు చేస్తున్నది. ఇన్నిరోజులు ప్రశాంతంగా ఉన్న వృత్తిదారులు తాజా నెలలో వచ్చిన కరెంటు బిల్లులను చూసి బెంబేలెత్తుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అలాంటిదేమీ లేదని చెబుతున్నా తమకు వచ్చిన మౌఖిక ఆదేశాలతో బిల్లులు జారీ చేసి, వసూలు చేస్తున్నట్లు కిందిస్థాయి సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి పథకం తాలూకు రీయింబర్స్‌మెంట్ లేక బిల్లులు జారీ చేస్తున్నట్లు కుండబద్దలు కొడుతున్నారు.

2021 నుంచి నిర్విఘ్నంగా..

కుల వృత్తిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేసీఆర్ ప్రభుత్వం 2021 నుంచి రాష్ట్రవ్యాప్తంగా హెయిర్ సెలూన్లు, ధోబీఘాట్లకు నెలకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇచ్చింది. ఈ పథకం నిన్నటిమొన్నటిదాకా నిర్విఘ్నంగా కొనసాగింది. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే సుమారు 25 వేల దాకా లబ్ధిదారులున్నారు. 250 యూనిట్లు దాటితే మిగతా యూనిట్లకు మాత్రమే బిల్లు చెల్లించారు. గతంలో ప్రభుత్వ సబ్సిడీతో జీరో బిల్లు జారీ అయ్యేది. ఈ క్రమంలో గత నెల దాకా లబ్ధిదారుగా ఉన్న ఓ సెలూన్ యజమానికి తాజా నెలలో సాధారణ వినియోగదారుడి మాదిరిగానే బిల్లు వచ్చింది. యూఎస్‌సీ నం.112243311 సెలూన్ షాప్‌నకు కరెంటు బిల్లు రూ.992.00 వచ్చింది. గత నెలలో ఇదే షాపునకు రూ.1065 బిల్లు వస్తే ప్రభుత్వ సబ్సిడీగా పేర్కొని జీరో బిల్లు జారీ చేశారు. ఇదేంటని లబ్ధిదారు ప్రశ్నిస్తే బిల్లు చెల్లించాల్సిందేనని విద్యుత్తు అధికారులు స్పష్టం చేయడంతో తప్పని పరిస్థితుల్లో బిల్లు చెల్లించాడు.

ఆదేశాల మేరకే బిల్లుల జారీ

సెలూన్లు, ధోబీఘాట్లకు నెలకు 250 యూనిట్ల ఉచిత కరెంటు పథకాన్ని నిలిపివేశారా? అని అధికారులను అడిగితే అలాంటిదేమీ లేదని చెబుతున్నారు. సైబర్‌సిటీ సర్కిల్ ఎస్ఈ వెంకన్నను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా పథకాన్ని అమలు చేస్తున్నామని, ఎవరికైనా బిల్లు జారీ అయితే తమ దృష్టికి తేవాలని చెప్పారు. కాగా బిల్లు జారీ అయిన గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని వసంత్‌నగర్ సెక్షన్ ఏఈ సత్యవాణిని సంప్రదించగా తమకు మౌఖిక ఆదేశాలున్నాయని స్పష్టం చేశారు. సెలూన్లు, ధోబీఘాట్లకు కూడా కరెంటు బిల్లులు జారీ చేసి వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నందునే బిల్లులు జారీ చేస్తున్నట్టు చెప్పారు.

- బడికి రండి

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బుదారపు హనుమాన్‌సాగర్, ఉపాధ్యాయులు మచ్చ రాజశేఖర్, రాజగోపాల్, దేవయ్య బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యాన్ని వివరించారు. పాఠశాల విశిష్టతను గ్రామస్థులకు వివరించారు. -మేడిపల్లి

- మొక్కు'బడి'..

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడెపల్లిలో ఉపాధ్యాయులు బడిబాటకు హాజరుకాక పాఠశాల తాళాలు తెరుచుకోలేదు. తొలిరోజు నామమాత్రంగా బడిబాట నిర్వహించి, మరుసటి రోజు నుంచి విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాత ఫొటోలనే అధికారులకు పంపిస్తూ వారిని తప్పుదారి పట్టిస్తున్నట్టు బాహాటంగా చర్చ జరుగుతున్నది. -నల్లబెల్లి

పోల్ వేస్తారా.. చావమంటారా?

- సెస్ కార్యాలయం ఎదుట రైతు ఆందోళన

సిరిసిల్ల టౌన్, జూన్ 10: 'నా పొలంలో లూజ్ వైర్లను తొలగించి విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేస్తారా? లేక చావమంటారా?' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు గంధం రమేశ్ సిరిసిల్లలోని సెస్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వ్యవసాయ భూమిలో వైర్లు వేలాడుతున్నాయని, గతం లో రెండు సార్లు తనతో పాటు తన భార్య కూడా విద్యుత్తు షాక్‌కు గురైనట్టు తెలిపాడు. కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని గతంలోనే డబ్బులు చెల్లించానని, ఇప్పటి వరకు అధికారులు ఎవరూ స్పందించడం లేదని విమర్శించాడు. తిరిగి రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డాడు. అడ్డా కూలీగా పని చేసే తాను పది వేలు ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నించాడు. ఇదేంటని అడిగితే 'చస్తే చావుపో.. మాకేంటి?' అని అధికారులు దురుసుగా మాట్లాడుతున్నారని వాపోయాడు. గతంలో తన వద్ద రూ.20 వేలు తీసుకుని 150 గజాలకు ఒక స్తంభం వేశారని చెప్పాడు. ప్రభుత్వం మేల్కొని తనలాంటి రైతులను కాపాడాలని వేడుకున్నాడు. తనకు న్యాయం జరగకపోతే ఇక్కడే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్ స్పందించి తనలాంటి నిరుపేద రైతులకు న్యాయం చేయాలని కోరాడు.

నెలాఖరులోగా కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు?

- పూర్తయిన క్షేత్రస్థాయి అధ్యయనం
- ప్రభుత్వ ఆదేశాలు రాగానే పెంపు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. భూముల విలువ సవరణపై ఇప్పటికే క్షేత్ర స్థాయి అధ్యయనం పూర్తయిందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, ఆదేశాస్తే వెంటనే పెంపుదల అమలు చేస్తామని చెబుతున్నారు. ఈ నెలాఖరులోగా ఆదేశాలు రావొచ్చని, దాదాపు 20-40 శాతం వరకు పెంపుదల ఉండొచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది మే 16న స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెంచాలని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.18,500 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.14,295 కోట్లు వచ్చింది. లక్ష్యంలో 77 శాతం మాత్రమే ఆదాయం రావడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉన్నదని, కాబట్టి భూముల విలువ, స్టాంపు డ్యూటీని సవరించాలని ఆదేశించారు. ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలో.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని స్పష్టం చేశారు. ఈ మేరకు స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిపారు. మార్కెట్ విలువకు అనుగుణంగా ఏయే ప్రాంతాల్లో ఎంత మేర పెంచవచ్చో నివేదికలు సిద్ధం చేశారు. ఇతర రాష్ట్రాల్లో పరిస్థితి ఎలా ఉన్నదో అధ్యయనం చేసి రెవెన్యూ శాఖ మంత్రికి వివరాలు అందజేసినట్టు తెలిసింది. వీటిని పరిశీలించిన అనంతరం భూముల విలువను ఎంత మేర సవరించాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది.

పెంచిన ధరలతోనే.. బడ్జెట్ అంచనాలు?

ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌కు కసరత్తులు ప్రారంభించింది. శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేసన్ల శాఖలో పెంచబోయే ధరలకు అనుగుణంగానే అంచనాలు రూపొందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. గత ఆర్థిక సంవత్సరం రూ.18500 కోట్ల ఆదాయ లక్ష్యం కాగా.. ఈసారి రూ.20-21వేల కోట్ల మధ్యలో అంచనాలు ఉండొచ్చని చెబుతున్నారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల ద్వారా గతేడాదితో పోల్చితే కనీసం 40 శాతం అదనపు ఆదాయం సాధించేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలుస్తున్నది.

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం గొప్పలు

- రికార్డు అంటూ మీడియాకు లీకులు
- తాజాగా కొన్నది 47.07 లక్షల టన్నులే
- 2020-21లో 92 లక్షల టన్నుల ధాన్యం
- ఐదేండ్ల కనిష్ఠానికి ధాన్యం కొనుగోళ్లు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): 47 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే రికార్డా? లేక 92 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే రికార్డా? అయితే, పౌరసరఫరాల సంస్థ, ప్రభుత్వ లెక్కలు చూస్తే పై డౌట్ అందరికీ వస్తుంది. ఈ యాసంగిలో 47.07 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన పౌరసరఫరాల సంస్థ.. 'ధాన్యం కొనుగోళ్లలో రికార్డు' అంటూ లీకులిచ్చి తమ అనుకూల మీడియాలో ఆదివారం వార్తలు రాయించుకున్నది. ఈ లీకులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ఏడాదికేడాది సరికొత్త రికార్డులను సృష్టించింది. 2018-19లో 37 లక్షల టన్నులు, 2019-20లో 64.16 లక్షల టన్నులు, 2020-21లో అయితే ఆల్‌టైం రికార్డు నెలకొల్పింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ సాధ్యంకాని విధంగా 92.28 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. అది కూడా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలోనే. ఆ తర్వాత 2021-22లో 50.39 లక్షల టన్నులు, నిరుడు యాసంగిలో 65.82 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఈ యాసంగిలో ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 47.07 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు దాదాపుగా పూర్తయ్యాయని కూడా లీకుల్లో ప్రకటించింది. అయితే, ధాన్యం కొనుగోళ్లు ఐదేండ్ల కనిష్ఠానికి పడిపోవడం గమనార్హం. ప్రస్తుత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల కోసం రూ.10,355 కోట్లు రైతులకు చెల్లించి.. ఏదో గొప్ప పని చేసినట్టు ప్రకటించుకొన్నది. 2020-21లో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.17,404 కోట్లు, నిరుడు యాసంగిలో రూ.13,531 కోట్లు చెల్లించింది. గత రికార్డులు ఇలా ఉంటే.. వాటన్నింటిని పక్కన పెట్టి 47.07 లక్షల టన్నులు కొనుగోలు చేసి రైతులకు రూ.10,355 కోట్లు చెల్లించి రికార్డులంటూ గొప్పలు చెప్పుకోవడంపై జోకులు పేలుతున్నాయి.

పేటీఎంలో మళ్లీ లేఆఫ్‌లు

న్యూఢిల్లీ: పేటీఎం మాతృ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేసింది. ఎంత మందిని తొలగించినది మాత్రం ఆ కంపెనీ వెల్లడించలేదు. ఉద్యోగాలు కోల్పోయిన వారు మరో ఉద్యోగం పొందడంలో తాము సాయం అందిస్తున్నట్టు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా ఉద్యోగాలు తొలగించాల్సి వచ్చినట్టు పేర్కొన్నది. ఉద్వాసనకు గురైన వారు వేరే సంస్థల్లో ఉద్యోగాలు పొందడంలో సాయం అందిస్తున్నామని, తమ హెచ్‌ఆర్ టీమ్ 30 సంస్థలతో కలిసి పనిచేస్తున్నదని వివరించింది.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

- నెలాఖరు నాటికి సర్వే పూర్తి

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): మిషన్ భగీరథ పథకంపై ప్రభుత్వం ఇంటింటి సర్వేను చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం నుంచి ప్రారంభమైన సర్వే క్షేత్రస్థాయిలో పది రోజులపాటు కొనసాగనున్నది. నాలుగైదు సంవత్సరాల క్రితమే బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణాల నుంచి పల్లెలకు వలసలు పెరిగాయి. పల్లెలో కొత్త కాలనీలు, పెద్దఎత్తున ఇండ్ల నిర్మాణాలు జరిగాయి. వాటన్నింటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వాలనే డిమాండ్ పెరిగింది. కొన్నింటికి కనెక్షన్ ఇచ్చినా.. ఇంకా మిగిలి ఉన్నాయా? అనే సమాచారాన్ని సేకరించడం, ఇంటి యజమాని వివరాలు సమగ్రంగా సేకరించడానికి సర్వేను ఉపయోగిస్తున్నారు. ఎన్ని రోజులకు ఒకసారి నల్లా వస్తున్నది.. ఎన్ని నీళ్లు వస్తున్నాయి ? తదితర సమాచారాన్ని సేకరిస్తున్నారు. దీంతోపాటు యజమాని ఆధార్, ఫోన్ నంబర్, ఇంటి ఫొటో, నల్లా సంపు ఫొటోను సర్వే సందర్భంగా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సర్వేను అంగన్‌వాడీలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెం ట్ల ద్వారా చేయిస్తున్నారు. రోజుకు 30-50 ఇండ్ల వరకు సర్వే చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అన్ని అవాసాల్లోనూ సర్వే చేస్తున్నారు.

లోకం పోకడ

ఓటర్లకు గాలం వేసే పనిలో పడి చేపల పెంపకం గురించి మర్చేపోయాడు!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.8°c	27.8°c
మెదక్	38.9°c	23.6°c
ఖమ్మం	38.0°c	27.0°c
మహబూబ్‌నగర్	37.1°c	27.4°c
నిజామాబాద్	36.7°c	25.5°c
కరీంనగర్	36.0°c	27.0°c
నల్లగొండ	35.0°c	24.4°c
రంగారెడ్డి	34.8°c	22.8°c
హైదరాబాద్	34.0°c	24.0°c
వరంగల్	29.0°c	26.0°c

రానున్న 3 రోజులు రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): విస్తరించిన నైరుతి రుతుపవనాల కారణంగా రానున్న మూడురోజులపాటు రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. మంగళవారం నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సిద్దిపేట,యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నదని ఆ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం నల్లగొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. గురువారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, నారాయణపేట జిల్లాల్లో వర్షం కురుస్తుందని పేర్కొన్నారు. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీచేశారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు నీటమునిగే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది.

వాహనదారులూ జాగ్రత్త:డీజీపీ

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలంలో వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని